
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 11 । జనవరి । 2023



71.997 టీఎంసీలకు సోమశిల

సోమశిల: జలాశయం మంగళవారానికి 71.997 టీఎంసీలకు చేరుకుంది. 3,749 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నార్ డెల్టాకు 2,520, ఉత్తరకాలువకు 550, దక్షిణకాలువకు 320 కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.57,710
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,155
3 శాతం జీఎస్టీతో	రూ.5,310
నవర (8 గ్రా)	రూ.42,480

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.5 /20.0

జిల్లా వ్యాప్తంగా మంగళవారం వాతావరణం పొడిగా ఉంటుంది. ఈశాన్య గాలుల ప్రభావంతో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. గాలిలో తేమ 46 శాతం ఉంది.

పదిపై గురిపెట్టని విద్యాశాఖ



- విద్యార్థులను సంసిద్ధత చేసేందుకు 100 రోజుల ప్రణాళిక
- వంద శాతం ఉత్తీర్ణతకు సాధన, పురోగామి పేర్లతో ప్రత్యేక బోధన
- ప్రతి రోజు స్లిప్ టెస్ట్‌తో పాటు ప్రత్యేక మెటీరియల్ పంపిణీ
- ఈ ఏడాది పరీక్షల తేదీ ప్రకటించినా ఇంకా పట్టించుకోని జిల్లా విద్యాశాఖ
- ఇన్‌చార్జి డీఈఓ కావడంతో జిల్లాపై దృష్టి సారించలేని వైనం
- ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలు కుర్చీలకే పరిమితం
- జిల్లాలో 27,291 మంది పది విద్యార్థులు

ఏప్రిల్ 3వ తేదీ నుంచి పరీక్షలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాశాఖను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. పేద విద్యార్థులు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు నాడు–నేడుతో ప్రత్యేక వసతులు, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, అమ్మఒడి తదితర పథకాలను అందజేస్తున్నారు. అయితే జిల్లాలో కొంత మంది విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు విద్యావ్యవస్థ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. పది పరీక్షలు ముంచుకొస్తున్న తరుణంలో విద్యార్థులను సంసిద్ధం చేయడంలో ప్రత్యేక దృష్టి సారించడం లేదన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి.



నెల్లూరులోని జెడ్పీ ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులు

నెల్లూరు (టౌన్): పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ప్రకటించినా జిల్లా విద్యాశాఖలో కదలిక లేదు. గతంలో పదో తరగతి ఫలితాల్లో జిల్లా ముందుం డాలనే లక్ష్యంతో విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికలను రూపొందించుకుని ముందుకు నడిచింది. గతంలో పది పరీక్షల తేదీని ప్రకటించిన తర్వాత విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా 100 రోజుల ప్రణాళిక ప్రకటించే వారు. 2018, 2019వ సంవత్సరంలో సాధన, 2020 నుంచి 2022 వరకు పురోగామి పేరుతో ప్రత్యేక శిక్షణ అందించారు. పరీక్షల కోసం తయారు చేసిన ప్రత్యేక మెటీరియల్స్‌ను పది విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ప్రతి రోజు సబ్జెక్ట్‌ల వారీగా స్లిప్ టెస్ట్‌లు నిర్వహించే వారు. ఉత్తీర్ణత, మార్కుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించే వారు. దీంతో పదో తరగతి ఫలితాల్లో ఏ విద్యా సంవత్సరంలో 80 శాతం ఉత్తీర్ణత తగ్గేది కాదు. కానీ కరోనా తర్వాత జిల్లాలో పదో తరగతి పరీక్షల ఫలితాలు అధమ స్థాయికి పడిపోయాయి. గతంలో మొదటి మూడు స్థానాల్లో ఉండే జిల్లా గత విద్యా సంవత్సరంలో 66.56 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 8వ స్థానంలో నిలిచింది. తాజాగా పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించినా.. పది పరీక్షలు దగ్గర పడుతున్నా ఇప్పటికీ అధికారుల్లో కదలిక లేదు. ఇప్పటికే ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్‌లో ప్రతి రోజు టెస్ట్‌లు పెడుతూ ఎక్కువ మార్కులు సాధించేందుకు ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు.

గతంలో పది ఫలితాలు ఒకసారి పరిశీలిస్తే

సంవత్సరం	ఉత్తీర్ణత శాతం
2015-16	92.94
2016-17	94.80
2017-18	80.37
2018-19	83.19
2019-20	ఆల్‌పాస్
2020-21	ఆల్‌పాస్
2021-22	66.56

జిల్లాలో 27,291 మంది విద్యార్థులు

జిల్లాలో మొత్తం 652 ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 335 ప్రభుత్వ, 317 ప్రైవేట్, కార్పొరేట్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో మొత్తం 27,291 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మొత్తం 6 పేపర్లు మాత్రమే ఉంటాయి. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది రోజు మార్చి రోజు పదో తరగతి పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ విధానం వల్ల పరీక్షకు పరీక్షకు ఒక రోజు సెలవు ఉండడంతో విద్యార్థులు మరింతగా ప్రిపేర్ కావడానికి ఉపయోగంగా ఉంటుంది.

సమయం 82 రోజులే

పదో తరగతి పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. పరీక్షలకు ఇక 82 రోజులు మాత్రమే ఉన్నాయి. ఇప్పటికీ జిల్లా విద్యాశాఖ పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించలేదు. ఆర్జేడీగా, జిల్లా ఇన్‌చార్జి డీఈఓగా ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో వారంలో సగం రోజులు అక్కడ, సగం రోజులు జిల్లాలో ఉండాల్సిన పరిస్థితి ఉంది. డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు ఉన్నా వారు పట్టించుకున్న పరిస్థితులు కనిపించడం లేదు. ఈ విషయంపై వారిని ప్రశ్నిస్తే డీఈఓ నుంచి ఆదేశాలు ఉంటే తప్ప మేం ఎలాంటి నిర్ణయం తీసుకోలేమని సమాధానం చెబుతున్నారు. ఉపాధ్యాయులు కూడా బోధన వరకే పరిమితమవుతున్నారు. పదో తరగతి ఉత్తీర్ణతపై ఇన్‌చార్జి డీఈఓ కూడా ఎప్పుడూ జిల్లా విద్యాశాఖ అధికారులతో సమావేశాలు నిర్వహించిన దాఖలా లేదు. పరీక్షలకు సమయం దగ్గర పడుతోంది. ఇప్పటి నుంచైనా పదో తరగతిపై ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప ఉత్తమ ఫలితాలు సాధించడం అసాధ్యం. గత విద్యా సంవత్సరంలో 66.56 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 8వ స్థానానికి చేరింది.

సంక్రాంతి సెలవుల తర్వాత ప్రత్యేక దృష్టి

ఈ నెల 20వ తేదీ నుంచి పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. జిల్లా పరిషత్ నుంచి స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్నారు. ఇప్పటికే వారితో మాట్లాడాం. అప్పటి నుంచి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తాం. ప్రతి రోజు టెస్ట్ నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా విద్యార్థులను తీర్చి దిద్దుతాం. పదిలో మంచి ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులకు కూడా కొన్ని మార్గదర్శకాలు జారీ చేస్తాం.

– సుబ్బారావు, ఇన్‌చార్జి డీఈఓ

నేడు జగనన్న తోడు

- చిరు వ్యాపారులకు రుణాలు
- ఆరో విడతలో 1,39,999 మందికి రూ.139.99 కోట్లు మంజూరు



నెల్లూరు (అర్బన్): వీధుల్లో, రోడ్ల వెంబడి తోపుడు బండ్ల మీద వ్యాపారం చేసుకునేవారు, పండ్లు అమ్ముకునే వారు, చిన్న, చిన్న టిఫిన్ సెంటర్లు నడుపుకునే వారి కోసం జగనన్న తోడు పథకం ద్వారా 6వ విడతలో ప్రభుత్వం జిల్లాలోని 1,39,999 మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున రూ.139.99 కోట్లను మంజూరు చేయనుంది. బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి నుంచి బటన్ నొక్కి ఈ రుణాలను అందించనున్నారు. అనంతరం జరిగే వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్‌లో కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ, మెప్మా పీడీ తదితరులు హాజరు కానున్నారు. తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించిన వారికి ప్రభుత్వమే తిరిగి వారు చెల్లించిన వడ్డీని లబ్ధిదారుల ఖాతాల్లో వేయనుంది. ఏ రోజుకారోజు రూ.5 నుంచి రూ.10 వడ్డీకి తీసుకుని వ్యాపారాలు చేసుకుంటున్న చిరు వ్యాపారులు అప్పులు పాలు కాకూడదనే ఉద్దేశంతో వీధి విక్రయదారులకు రుణాలు మంజూరు చేస్తోంది. గతంలో 5వ విడతలో 19,093 మందికి రూ.19.09 కోట్లు రుణాలు మంజూరు చేయగా ఇప్పుడు 6వ విడతలో ఏకంగా 1,39,999 మందికి రుణాలు మంజూరు చేయడం విశేషం.

న్యూస్‌రీల్

నేటి నుంచి జూనియర్ కళాశాలలకు సెలవులు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని అన్ని యాజమాన్య జూనియర్ కళాశాలలకు గురువారం నుంచి ఈ నెల 17వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు ఆర్‌ఐఓ వరప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న జూనియర్ కళాశాలలు పునః ప్రారంభమవుతాయన్నారు.

20లోపు తప్పులను సరిదిద్దుకోవాలి

నెల్లూరు (టౌన్): పదో తరగతి 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్‌లో విద్యార్థుల వివరాలు తప్పుగా నమోదు చేసి ఉంటే వాటిని పాఠశాల లాగిన్‌లో ఈ నెల 20వ తేదీలోపు సవరించుకునే వీలు కల్పించినట్లు ఇన్‌చార్జి డీఈఓ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు సంబంధించి పేరు, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ, రెండో లాంగ్వేజీ ఆప్షన్, మీడియం, అంగవైకల్యం, ఓఎస్‌ఎస్‌సీ సబ్జెక్ట్ కోడ్స్, వొకేషన్ ఎస్‌ఎస్‌సీ సబ్జెక్ట్ కోడ్‌లు, పుట్టు మచ్చలు, విద్యార్థి ఫొటో, సంతకం తదితర వాటిని సవరించుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు ప్రభుత్వ పరీక్షల అధికారిక వెబ్‌సైట్ www.bse.ap.gov.in లేదా స్థానిక దర్గామిట్టలోని జిల్లా పరిషత్ స్కూల్‌లో ఉన్న పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్‌ను సంప్రదించాలన్నారు.

పోలేరమ్మ తల్లీ పాహిమాం.. పాహిమాం



అమ్మవారిని దర్శించుకున్న మంత్రి కాకాణి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, తదితరులు

- అన్ని దారులు అల్లూరు వైపే
- జాతరకు పోటెత్తిన భక్తులు
- అమ్మవారిని దర్శించుకున్న మంత్రి, రాజ్యసభ సభ్యుడు, ఎమ్మెల్యే



ప్రత్యేక పుష్పాలంకరణలో పోలేరమ్మ ఆలయం



పోలేరమ్మకు పసుపు కుండల్లో సద్ది తెస్తున్న మహిళలు

కావలి: అల్లూరు గ్రామదేవత పోలేరమ్మ జాతర మహోత్సవాన్ని మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు, మొక్కుబడులు చెల్లించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా దేశవిదేశాల్లో ఉన్న అల్లూరీయులు, అమ్మవారి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పంటల అల్లూరులో స్వయంభువుగా వెలసిన పోలేరమ్మకు ప్రతి ఏటా సంక్రాంతికి ముందు వచ్చే మంగళవారం రోజున జాతర నిర్వహించడం వందల సంవత్సరాల నుంచి వస్తున్న ఆనవాయితీ. జాతరకు స్థానికులు, సమీప గ్రామాల ప్రజలతో పాటు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చే భక్తులతో అల్లూరు జన సంద్రంగా మారింది. ఈ దఫా జాతరకు జనం మరింత అధికంగా రావడంతో వేకువ నుంచే రద్దీ నెలకొంది. జాతరలో భాగంగా ఉదయం ఆరు గంటలకే అమ్మవారు స్వర్ణాభరణాలు, విశేష పుష్పాల అలంకరణలో ప్రత్యేక దర్శనమిచ్చారు. పోలేరమ్మకు తొలిసారిగా నిర్వహించిన రత్నాలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆరున్నర గంటలకు అమ్మవారి గ్రామపూజ నిర్వహించారు. అనంతరం ఆచార సద్ది నివేదనకు భక్తులు భారీగా తరలివచ్చారు. ముత్తయిదువులంతా పసుపు కుంకుమలు, వేపమండలతో అలంకరించిన కుండల్లో చద్ది నివేదనకు బారులు తీరి వచ్చారు.

చల్లంగా చూడు తల్లీ..

జాతర సందర్భంగా స్థానికులతో ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పాహిమాం.. పాహిమాం అంటూ పాడి పంటలు పండించి, పిల్లా, జల్లా, గొడ్డు గోదలను చల్లంగా చూడమ్మా అని అమ్మవారిని వేడుకున్నారు. అమ్మవారిని దర్శించుకుంటే సమస్త ఈతిబాధలు తొలగిపోతాయనే నమ్మకంతో భక్తులు భారీగా తరలివచ్చారు. అన్ని దారులు అల్లూరు వైపు కదిలిరావడంతో ఉదయం నుంచే ఆలయ పరిసరాలు, గుడి వీధులన్నీ ఇసుక వేస్తే రాలనంతంగా జనంతో కిటకిటలాడిపోయాయి. జిల్లాలో విశిష్టతగా జరిగే అల్లూరు పోలేరమ్మ జాతరను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత మన్నెమాల సుకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు చద్ది నివేదనలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయాన్ని అనుసరించి మధ్యాహ్నం కొమ్ము కోళ్ల ద్వారా నిర్వహించిన పోలేరమ్మ కథా కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సాయంత్రం పోతురాజు దగ్గర పోలేరమ్మకు సలిపిండి, పానకాల సమర్పించేందుకు కూడా భక్తులు భారీగా తరలివచ్చారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి చర్యలు

నెల్లూరు(పొగతోట): జిల్లాలో ఖాళీగా ఉన్న 143 గ్రామ వలంటీర్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలాల వారీగా బుధవారం నోటిఫికేషన్లు విడుదల చేయాలని ఎంపీడీఓలను ఆదేశించామన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగి పదో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈనెల 18వ తేదీలోపు http://gramaward sachivalayam.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను 19వ తేదీన పరిశీలిస్తామన్నారు. 20, 21 తేదీల్లో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన వారికి 23వ తేదీన పోస్టింగ్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ల ప్రకారం అభ్యర్థుల ఎంపిక విధానం ఉంటుందన్నారు. అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

తెలుగు లోగిళ్లలో పెద్ద పండగ శోభ

- పోటాపోటీగా ముగ్గులు తీర్చిదిద్దుతున్న మహిళలు
- పిండి వంటల తయారీలో నిమగ్నం


ముగ్గు వేస్తున్న మహిళ

ఆత్మకూరురూరల్: దట్టంగా కురిసే పొగమంచు.. ఇంటి ముందు కళ్లాపి చల్లి పోటాపోటీగా రంగవల్లులను తీర్చిదిద్దే మహిళలు, యువతులు.. పిండివంటల ఘుమఘుమలు.. ఆలయాల్లో ధనుర్మాస పూజలు.. పల్లె, పట్టణాల్లో పెద్ద పండగ శోభ నెలకొంది. భోగి, సంక్రాంతి, కనుమ పండగలకు నెలరోజుల ముందు ధనుర్మాసం ప్రారంభమవుతుంది. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిశాయి. దీంతో వ్యవసాయదారులు పంటలను సకాలంలో సాగు చేపట్టడంతో పల్లెసీమలు పచ్చదనం పరుచుకుని ధనుర్మాస శోభకు నిండుతనం చేకూరింది. ప్రతి ఇంట్లో ఆడపడుచులు నెల మొత్తం తెల్లవారుజామునే నిద్ర లేచి కళ్లాపి చల్లి ముగ్గులు వేయడం, దద్దోజనం, పొంగలి లాంటి నైవేద్యాలతో విశేష పూజలు నిర్వహించి అనంతరం అందరికీ పంచిపెట్టడం లాంటి కార్యక్రమాలతో సందడి నెలకొంది.


పొగమంచు కురుస్తున్న వేళలో మహిమలూరు వేణుగోపాలస్వామి ఆలయం


ఆత్మకూరు సమీపంలో పిండివంటలు చేస్తూ..

సంతోషంగా చేసుకోవాలని..

ఈ నెలలో సూర్యోదయమై గంటలు గడిచిపోయినా ముసురుకున్న మంచుతెరలు తొలగక ఒకింత ఇబ్బందికరంగా ఉన్నా ఆ ప్రకృతి సౌందర్యం ఆస్వాదించేందుకే చాలామంది ఇష్టపడుతుంటారు. భోగి పండగ ముందురోజు వరకు కొనసాగే ఈ ధనుర్మాసం అదేరోజు సూర్యుడు మకరరాశిలో ప్రవేశం చేయడంతో ముగుస్తుంది. ఉద్యోగం, చదువులు, జీవనోపాధి నిమిత్తం దూర ప్రాంతాల్లో ఉంటున్నవారు ఇళ్లకు చేరుకోవడం.. పండగ రోజుల్లో స్నేహితులు, బంధువులు, గ్రామస్తులతో ఆనందంగా గడపడం సంక్రాంతి ప్రత్యేకత. పెద్ద పండగ నాటికి పలురకాల పిండివంటలు దాదాపు ప్రతి ఇంట్లోనూ తయారు చేసి పేదలకు దానధర్మాలు చేయడం ధనుర్మాసంలో మరో గొప్ప ఆచారంగా ఉంది. అలాగే ఇంటిల్లిపాది కొత్త దుస్తులు కొనుగోలు చేయడం, కుమార్తెలు, కొత్త అల్లుళ్లు, వారి కుటుంబసభ్యుల రాకతో పుట్టిళ్లు కొత్తకళను సంతరించుకుంటున్నాయి.

కోలాహలంగా..

పల్లె, పట్టణాల్లో చిల్లర దుకాణాలు బిజీబిజీగా కనిపిస్తున్నాయి. పండగ సందర్భంగా అనేక వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. అనేకమంది నెల్లూరుకు వచ్చి షాపింగ్ మాల్స్ తదితర వాటిల్లో దుస్తులు కొనుగోలు చేస్తున్నారు.

ఉద్యోగం పేరుతో టోకరా

- రూ.లక్ష కాజేసిన వైనం

నెల్లూరు(క్రైమ్): ఉద్యోగం పేరిట ఓ యువకుడిని మోసగించి నగదు కాజేసిన ఘటనపై వేదాయపాళెం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఉమ్మారెడ్డిగుంటకు చెందిన వెంకటేశ్వర్లు పీజీ చదువుకున్నాడు. అతను ప్రస్తుతం ముత్తుకూరు మండలం పంటపాళెంలోని పామాయిల్ ఫ్యాక్టరీలో పనిచేస్తూ ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. గతేడాది డిసెంబర్ 24వ తేదీన వినోదిని అనే మహిళ ఫోన్ చేసి రూ.లక్ష డిపాజిట్ చేస్తే అమెజాన్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ పార్ట్ టైమ్ జాబ్ వస్తుందని నమ్మబలికింది. దీంతో వెంకటేశ్వర్లు ఫోన్‌పే ద్వారా నగదు పంపాడు. రోజులు గడుస్తున్నా స్పందన లేకపోవడంతో వెంకటేశ్వర్లు ఆమెకు ఫోన్ చేశాడు. సదరు మహిళ మరికొంత నగదు ఇవ్వాలని కోరింది. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కొడవలూరు: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన కొడవలూరు రైల్వే గేట్ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. రైల్వే ఎస్సై అరుణకుమారి కథనం మేరకు.. సుమారు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తిని విజయవాడ వైపు వెళ్తున్న రైలు ఢీకొనడంతో శరీరం గుర్తుపట్టలేని విధంగా మారింది. ప్రమాదవశాత్తు జరిగిందా? లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అనే విషయం తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని మార్చురీలో పెట్టామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

రేపు జాబ్‌మేళా

నెల్లూరు(మినీబైపాస్): ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ), ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్, సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్ ఏపీ (ఎస్ఈఈడీఏపీ) సంయుక్తంగా గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎ.సురేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాయుడుపేటలోని గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, ఇంకా ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, నెల్లూరు కంపెనీల్లో ఎస్ఎస్‌సీ, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా చదివిన అభ్యర్థుల కోసం అల్లూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయసున్న అభ్యర్థులు అర్హులన్నారు. ఇతర వివరాలకు 99497 12892, 80747 61306, 89851 20012 నంబర్లను సంప్రదించాలన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఆర్ఎస్సార్ ప్రతిభ


ట్రోఫీ అందుకుంటున్న దృశ్యం

కావలి: గౌరవరంలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు జాతీయస్థాయి కరాటే పోటీల్లో విజేతలుగా నిలిచారు. ముంబైలో కిక్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 8, 9వ తేదీల్లో నాలుగో జాతీయస్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ జరిగింది. 'ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్-2023' పేరుతో నిర్వహించిన ఈ పోటీలకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు హాజరవగా ఆర్ఎస్సార్ ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారు. 21 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో ప్రతిభ చాటడంతో చాంపియన్‌షిప్ సాధించారు. అంతే కాకుండా ఎక్కువమంది విద్యార్థులు పోటీలకు హాజరైన పాఠశాలగా కూడా ఆర్ఎస్సార్ గుర్తింపు సాధించింది.

చట్టప్రకారమే చర్యలు తీసుకున్నాం

- కావలి ఘటనల్లో పోలీసులు వేగంగా స్పందించారు
- ఎస్పీ విజయారావు

నెల్లూరు(క్రైమ్): 'కావలిలో ఈ మధ్యకాలంలో చోటుచేసుకున్న ఘటనల్లో చట్టప్రకారమే చర్యలు తీసుకున్నాం. ఎలాంటి అపోహలకు తావులేదు.' అని ఎస్పీ సీహెచ్ విజయారావు స్పష్టం చేశారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్లో మంగళవారం ఆయన వివరాలను వెల్లడించారు. కావలి మండలం ముసునూరు ఎస్సీకాలనీకి చెందిన దుగ్గిరాల కరుణాకర్ గతేడాది ఆగస్టు 20వ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. అందుకు బాధ్యులైన ఇద్దరు వ్యక్తులపై 306 రెడ్‌విత్ 34 ఐపీసీ, ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కావలి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశామన్నారు. వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. విచారణ పూర్తి చేసి చార్జిషీట్ సైతం కోర్టులో దాఖలు చేశామన్నారు.

➡ దగదర్తి మండలం ఉలవపాళ్ల గ్రామానికి చెందిన గోచిపాతల తేజపై గతేడాది డిసెంబర్ 31వ తేదీ రాత్రి అదే మండలానికి చెందిన ఓ వ్యక్తి, అతడి కారు డ్రైవర్ దాడి చేసి కులం పేరుతో దూషించారని ఎస్పీ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు, ఘటనా స్థలంలో లభించిన సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులపై 324, 323 రెడ్‌విత్ 34 ఐపీసీ, ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేశామన్నారు. వారిని కోర్టులో హాజరుపరచగా ఏడేళ్లకంటే తక్కువ శిక్ష కాబట్టి నోటీసులు ఇవ్వాలని కోర్టు ఆదేశించిందన్నారు. దీంతో నిందితులకు నోటీసులు అందజేశామన్నారు. తదుపరి విచారణ సాగుతోందన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ విజయారావు

➡ గతేడాది డిసెంబర్ 28వ తేదీన బోగోలు మండలం కడనూతల గ్రామానికి చెందిన పైడి హర్ష కావలి ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని విజయారావు చెప్పారు. హర్ష అన్న పైడి చైతన్య ఫిర్యాదు మేరకు కావలి రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. హర్ష ప్రస్తుతం చెన్నై అపోలో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో ఉందన్నారు. ఈ మూడు ఘటనల్లో పోలీసుల పరంగా ఎలాంటి వైఫల్యం లేదన్నారు. చట్టప్రకారమే చర్యలు తీసుకున్నామని, ఇప్పటికే కరుణాకర్ ఆత్మహత్య, తేజపై దాడి కేసులో నిందితులను అరెస్ట్ చేశామన్నారు. దీనిని కొందరు రాజకీయం చేసేందుకు చలో కావలికి పిలుపునిచ్చారన్నారు. శాంతిభద్రతల దృష్ట్యా ఈ కార్యక్రమానికి అనుమతి ఇవ్వలేదన్నారు.

బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపిక


హేమంత్


స్రవంతి

కందుకూరు రూరల్: 66వ ఎస్‌జీఎఫ్ అండర్-19 బాస్కెట్‌బాల్ బాలబాలికల పోటీలు ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు అనకాపల్లిలో జరిగాయి. ఇందులో ప్రతిభ చూపిన టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు చదలవాడ హేమంత్, కె.స్రవంతి రాష్ట్ర బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారని పీడీ టి.సుబ్బారావు మంగళవారం తెలిపారు. త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. ఎంపికైన వారిని ప్రిన్సిపల్ కె.నాగేశ్వరరావు, పీడీ, అధ్యాపకులు అభినందించారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	రూ.17
సన్నవి	రూ.10
పండ్లు	రూ.4

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	126
లేయర్ (లైవ్)	85
బ్రాయిలర్ చికెన్	220
బ్రాయిలర్ స్కిన్‌లెస్	244
లేయర్ చికెన్	145



క్లుప్తంగా

28న గౌర - నితాయ్ రథయాత్ర



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న సుఖదేవస్వామి, తదితరులు

నెల్లూరు(బృందావనం): గౌర – నితాయ్ రథ యాత్రను నగరంలో ఈ నెల 28న నిర్వహించనున్నామని ఇస్కాన్ మందిరాధ్యక్షుడు సుఖదేవస్వామి పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను నగరంలోని ఇస్కాన్ మందిరంలో మంగళవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. సంతపేటలోని నాలుగు కాళ్ల మండపం నుంచి ప్రారంభమయ్యే రథయాత్ర అన్నమయ్య సర్కిల్ సమీపంలోని పీవీఆర్ కల్యాణ మండపానికి చేరుకోనుందని తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 100 మందికిపైగా ఇస్కాన్ మందిరాల అధ్యక్షులు హాజరుకానున్నారని వివరించారు. జగన్నాథ, బలదేవ, సుభద్ర దర్శనం, ఛప్పన్ భోగ్, తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు. మందిర మేనేజర్ చిన్మయకృష్ణదాసుప్రభు, రథ యాత్ర కమిటీ సభ్యులు గిరి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మాజీ ఉప రాష్ట్రపతిని కలిసిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



వెంకటాచలం : మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టులో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం ఇచ్చారు. ఐదు రోజుల నెల్లూరు జిల్లా పర్యటనలో భాగంగా ముప్పవరపు వెంకయ్యనాయుడు సోమవారం స్వర్ణభారత్ ట్రస్టుకు వచ్చారు. నెల్లూరు, వెంకటాచలం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు, వివిధ శాఖల అధికారులు మంగళవారం వెంకయ్యనాయుడును కలిశారు.

కోవూరులో సేదతీరిన పుదుచ్చేరి సీఎం



కోవూరు : పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎస్.రంగస్వామి శ్రీశైలం మల్లన్న దర్శనం చేసుకుని తిరుగు పయనమవుతూ సోమవారం అర్ధరాత్రి కోవూరు జాతీయ రహదారి సమీపంలో ఉన్న అనపల్లి కన్వెన్షన్ సెంటర్‌లో కొద్దిసేపు సేదతీరారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక నాయకులు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానం పలికారు. కన్వెన్షన్ సెంటర్‌లో అనపల్లి అశోక్ కుమార్‌రెడ్డి ప్రత్యేకంగా చేసిన ఏర్పాట్లపై సీఎం రంగస్వామి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు మంత్రులు, స్థానిక నాయకులు తాటిపర్తి విజయకుమార్‌రెడ్డి, అత్తిపల్లి పవన్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

డీఎల్డీఏ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కోవూరు : జిల్లా గ్రామీణాభివృద్ధి సంఘం వారు పాడి రైతుల్లో మరింత అవగాహన పెంచి డీఎల్‌డీఏ అందిస్తున్న సేవలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్ అన్నారు. కోవూరులోని డీఎల్‌డీఏ సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మేలు జాతి పశు సంపదను పెంచేలా డీఎల్‌డీఏ దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. రూ.20 వేలు విలువ చేసే మేలు జాతి దూడలను రైతులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారంతో పశుగణాభివృద్ధి కేంద్రం ప్రహరీ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేశారన్నారు. డీఎల్‌డీఏ కార్యవర్గంతో పాటు పాడిరైతుల సహకారంతో గత సంవత్సరం రాష్ట్రస్థాయి అవార్డు డీఎల్‌డీఏకు వచ్చిందన్నారు. ఇదే స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ మహేశ్వరుడు, విజయా డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డెయిరీ ఎండీ కృష్ణమోహన్‌రెడ్డి, డాక్టర్ సోమయ్య, పశు వైద్యులు సురేష్, వసంత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రణాళికలు

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్



కరపత్రాలను అందజేస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):నియోజకవర్గంలో రోడ్లు, డ్రెయిన్లు, వీధిదీపాలు, తదితర సమస్యలను ప్రణాళికబద్ధంగా పరిష్కరించనున్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. 48వ డివిజన్లోని కుక్కలగుంట, రాజేంద్రనగర్, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఇంటింటికీ వెళ్లి వివరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న చిన్న సమస్యలను నెలన్నరలో పరిష్కరిస్తామని చెప్పారు. రానున్న ఆర్నెల్లో నియోజకవర్గంలో రోడ్లు, డ్రెయిన్ల పనులను నూరు శాతం పూర్తి చేసేలా ప్రణాళికలను రూపొందించామని వివరించారు. ఏప్రిల్ నెలాఖరుకు పూర్తి చేసేలా సుమారు రూ.20 కోట్లతో పనులను చేపట్టనున్నామని వెల్లడించారు. మెయిన్ రోడ్లలో ప్యాచ్ వర్క్‌లను త్వరలో చేపట్టనున్నామని పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి సిద్ధిఖ్, తదితరులు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయాలి



నెల్లూరు సిటీ: కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో హడ్కో నిధులతో చేపట్టిన తాగునీరు, భూగర్భ డ్రైనేజీ పనులను వేగవంతం చేయాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో పబ్లిక్ హెల్త్, ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నిర్దేశిత సమయానికి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, ఈఈ మదర్సా అలీ, ఇంజినీరింగ్ ఎస్‌ఈ సంపత్‌కుమార్, సంజయ్ పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభల జయప్రదానికి పిలుపు



వేదాయపాళెం సెంటర్‌లో కార్మికుల ర్యాలీ

నెల్లూరు(వేదాయపాళెం): బెంగళూరులో ఈ నెల 18 నుంచి 23 వరకు నిర్వహించనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ వేదాయపాళెం సెంటర్‌లో కార్మికులు ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా నుంచి కార్మికులు తరలిరావాలని కోరారు. సీఐటీయూ నేతలు ప్రసాద్, సంపత్‌కుమార్, కృష్ణయ్య, కిన్నెరకుమార్ సుధాకర్, సుజాతమ్మ, తిరుపాల్, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



నెల్లూరు రూరల్: క్రీడల్లో యువత రాణించాలని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ములుమూడిలో క్రికెట్ టోర్నీని మంగళవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. క్రీడలపై ఆసక్తి కల్పించాలనే ఉద్దేశంతో ఐదు వేల మందికి క్రీడా పరికరాలను అందజేశామని వివరించారు. సర్పంచ్ కరుణాకర్, నరసింహకొండ దేవస్థాన చైర్మన్ సురేంద్రరెడ్డి, నేతలు మీరామొహిద్దీన్, చిన్నయ్య, రామ్‌గోపాల్, రమణయ్య, వెంకటేశ్వర్లు, మల్లయ్య, మన్సూర్, తదితరులు పాల్గొన్నారు.

'నారాయణ'లో ప్లేస్‌మెంట్ డ్రైవ్



నెల్లూరు (టౌన్): నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ అసెస్మెంట్ భాగస్వామి స్మార్ట్ బ్రెయిన్ ఇంజినీరింగ్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను మంగళవారం నిర్వహించారు. జిల్లాలోని డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో 2017 నుంచి ఉత్తీర్ణులైన విద్యార్థులు హాజరయ్యారు. 700 మందికి ఇంటర్వ్యూలను నిర్వహించగా, 312 మంది ఎంపికయ్యారు. కళాశాల మేనేజ్‌మెంట్ సెక్రటరీ వినయ్‌కుమార్, ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైమ్): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడు మంగళవారం మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. బాలాజీనగర్‌లోని సరస్వతీనగర్‌లో నివాసం ఉంటున్న వెంకురెడ్డి (72), ప్రమీల దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె సుమలత భర్త సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో గతేడాది మృతి చెందారు. అప్పటి నుంచి తల్లిదండ్రుల వద్దే కుమార్తె ఉంటున్నారు. అల్లుడు చనిపోయారనే బాధ, అనారోగ్య సమస్యలతో వెంకురెడ్డి మానసికంగా కుంగిపోయారు. నవాబుపేట సమీపంలోని పోలీస్ క్వార్టర్స్ వద్ద గల పాత ఇంటి వరకు వెళ్లొస్తానని ఈ నెల నాలుగున బయల్దేరారు. అక్కడ మద్యంలో విషం కలుపుకొని తాగి అపస్మారక స్థితిలో పడిపోయారు. ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో తెలిసిన వారిని అక్కడికెళ్లి చూసి రావాలని భార్య, కుమార్తె పంపారు. వెంకురెడ్డి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన వారు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబసభ్యులు హుటాహుటిన అక్కడికి చేరుకొని చికిత్స నిమిత్తం ఆయన్ను అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకురెడ్డి మృతి చెందారు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): ఇంటి నుంచి మహిళ అదృశ్యమైన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. లేక్‌వ్యూ కాలనీకి చెందిన సుశీల ఈ నెల 8న ఇంటి నుంచి అదృశ్యమయ్యారు. భర్త సునీల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నెల్లూరు(క్రైమ్): ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్‌ఈబీ అధికారులు సీజ్ చేశారు. వివరాలు.. ఎస్‌ఈబీ నెల్లూరు – 1 ఎస్సై శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి శెట్టిగుంట రోడ్డులోని సర్వేపల్లి కాలువ బ్రిడ్జి వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. కోవూరు మండలం జమ్మిపాళేనికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రామకృష్ణను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం ట్రాక్టర్, నిందితుడ్ని నవాబుపేట పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగినికి వేధింపులు

నెల్లూరు(క్రైమ్): ఉద్యోగినిని వేధింపులకు గురిచేస్తున్న ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. పొదలకూరు రోడ్డులోని ఏపీజీఎల్ఐ కార్యాలయంలో ఓ మహిళ అటెండర్‌గా పనిచేస్తున్నారు. కొంతకాలంగా ఆమెను కార్యాలయ సూపరింటెండెంట్ రాజన్ వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు ఆయన్ను మందలించారు. అయినా అతని ప్రవర్తనలో మార్పురాలేదు. విసిగిపోయిన బాధితురాలు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రదానం



లక్ష్మీకాంతం (ఫైల్)

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బాలాజీనగర్‌కు చెందిన న్యాయవాది రవికుమార్ తల్లి లక్ష్మీకాంతం (80) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆమె నేత్రాలను దానం చేయనున్నామని జిల్లా అంధత్వ నివారణ సంస్థ నెల్లూరు ప్రోగ్రామ్ మేనేజర్ శర్వాణికి రవికుమార్ సమాచారం అందించారు. దీంతో నేత్రాలను జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నేత్రదాన మోటివేటర్ బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ నేత్ర ఆస్పత్రి టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. అనంతరం సర్టిఫికెట్‌ను అందజేశారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



నెల్లూరు(వేదాయపాళెం): సింహపురి స్వర్ణ కార్మిక పరస్పర సహాయక సహకార సంఘ క్యాలెండర్లను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ మంగళవారం ఆవిష్కరించారు. కొరడావీధిలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్లు రామకృష్ణ, మహేష్, రంగనాథస్వామి దేవస్థాన చైర్మన్ శివకుమార్, సింహపురి స్వర్ణ కార్మిక పరస్పర సహాయక సహకార సంఘ అధ్యక్షుడు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ నూతన కార్యవర్గ ఎన్నిక

నెల్లూరు(బృందావనం) వీహెచ్‌పీ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని ప్రాంత గోరక్ష ప్రముఖ్ శశికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు జిల్లా ఆదోనిలో నిర్వహించిన వీహెచ్‌పీ దక్షిణాంధ్ర ప్రాంత విస్తృత స్థాయి సమావేశాల్లో ఎన్నుకున్నారన్నారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శిగా నాగఫణిశర్మ, సత్సంగ్ ప్రముఖ్‌గా రామ్‌శరణ్ మనోజ్‌గుప్తా, ఉపాధ్యక్షుడిగా యానాదిరెడ్డి, ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్‌గా రాజా, సహ కోశాధికారిగా సురేష్, అర్చక పురోహిత్ ప్రముఖ్‌గా శ్రీనివాసరావు, మఠ మందిర్ ప్రముఖ్‌గా శ్రీధర్, ధర్మయాత్ర మహాసంఘ్‌గా నాగరాజు, సంస్కృతి, భాషా ప్రముఖ్‌గా రవికుమార్, వీహెచ్‌పీ నగర కార్యదర్శిగా శరవణమహేష్ శర్మ, సహ కార్యదర్శిగా రామకృష్ణ నియమితులయ్యారని వివరించారు.

13 నుంచి సంక్రాంతి ఉత్సవాలు



మాట్లాడుతున్న రంగరాజన్

నెల్లూరు(బృందావనం): నగరంలో సంక్రాంతి ఉత్సవాలను ఈ నెల 13 నుంచి 15 వరకు ఘనంగా నిర్వహించనున్నామని సింహపురి సంక్రాంతి ఉత్సవ సమితి అధ్యక్షుడు రంగరాజన్ పేర్కొన్నారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన సమావేశాన్ని నగరంలోని టీవీఎస్ కల్యాణసదన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రంగనాథస్వామి గోదాదేవి కల్యాణ మహోత్సవాన్ని టీవీఎస్ కల్యాణ సదన్‌లో శుక్రవారం నిర్వహించనున్నామని చెప్పారు. ముఖ్య అతిథులుగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఉష దంపతులు, డీఆర్డీఓ మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి దంపతులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. అనంతరం ఉత్సవ సమితి కార్యదర్శి మోహన్‌రావు మాట్లాడారు. పలు కూడళ్లలో భోగి మంటలను ఈ నెల 14న తెల్లవారుజామున వేయనున్నామని పేర్కొన్నారు. సమితి గౌరవ సలహాదారులు ఫణిరత్నం, రమణయ్య, సుబ్రహ్మణ్యం, వ్యాసప్రసాద్, రమేష్, వెన్నెల, రాజేశ్వరి, సింహపురి గణేష్ ఉత్సవ సమితి అధ్యక్ష, కార్యదర్శులు సురేంద్రరెడ్డి, సత్యనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దల పండగకు పటిష్ట ఏర్పాట్లు



సమాధుల తోటను పరిశీలిస్తున్న హరిత

నెల్లూరు సిటీ: సంక్రాంతిని పురస్కరించుకొని బోడిగాడితోటలో నిర్వహించనున్న పెద్దల పండగకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. బోడిగాడితోటలో సమాధుల తోటను అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేలా పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. సమాధులకు సున్నాలు వేయించాలని.. పశువులు సంచరించకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ ఈఈలు సంజయ్, చంద్రయ్య, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా సంక్రాంతి సంబరాలు



ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ సెంటర్‌లో..



ఎస్వీఎస్ స్కూల్లో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ సెంటర్‌లో సంక్రాంతి సంబరాలను మంగళవారం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, స్పాస్టిక్స్ సెంటర్ కన్వీనర్ సుబ్బారెడ్డి సూచనల మేరకు భోగి మంటలు వేసి, రంగవల్లులను తీర్చిదిద్దారు. ప్రిన్సిపల్ గుర్నాథరావు, వైస్ ప్రిన్సిపల్ మాధురి, ఎమ్సీ మెంబర్లు రవిప్రకాష్, రాజేంద్రప్రసాద్, అరుణమ్మ, సెక్రటరీ మస్తానయ్య, ఏఓ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: కొత్తూరు పరిధిలోని గ్రామికనగర్‌లో గల ఎస్వీఎస్ స్కూల్లో చిన్నారులపై భోగి పండ్లు పోసి ఉపాధ్యాయులు దీవించారు. విద్యార్థుల తల్లులకు రంగవల్లుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. నెల్లూరు బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, కరస్పాండెంట్ వెంకటేశ్వర్లురెడ్డి, స్కూల్ ఇన్‌చార్జి గౌరి, తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై శిక్షణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): చెత్త సేకరణ, వేరుచేయడం, రవాణా, తదితర అంశాలపై ర్యాగ్ పికర్స్‌కు శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్) – విజయవాడ, ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కార్యాలయ ప్లానింగ్ అధికారి ప్రసాద్ మాట్లాడారు. చెత్తను సేకరించే వృత్తి నుంచి బయటకొచ్చి సురక్షితమైన, గౌరవప్రదమైన జీవనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పిల్లలను పాఠశాలలకు పంపాలని కోరారు. మెప్మా పీడీ రవీంద్ర, ఎస్సీ కార్పొరేషన్ ఈఓ సెల్వి, సీపెట్ అధికారి సుందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

30న మధ్వ నవమి



మాట్లాడుతున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): మండపాలవీధిలోని రాఘవేంద్రస్వామి మందిరంలో మధ్వ నవమిని ఈ నెల 30న నిర్వహించనున్నామని సింహపురి మధ్వ సంఘ అధ్యక్షుడు ప్రవీణ్ పేర్కొన్నారు. రాఘవేంద్రస్వామి మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సహస్రశంఖ క్షీరాభిషేకం, అనంతరం పురంధర దాసర భజనమండలి ఆధ్వర్యంలో భజనలను నిర్వహించనున్నామని వివరించారు. కంబాలూరు వ్యాసపీఠ ప్రతిష్ఠాన కార్యనిర్వాహకుడు శ్రీధరాచార్య, వ్యాసరాజ మఠం మేనేజర్ రవీంద్రబాబు, గౌరవ కార్యనిర్వాహకులు సుబ్బారావు, మధుసూదన్‌రావు, నాగరాజరావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్టి హరచతుర్థి



నెల్లూరు(బృందావనం): సంకష్టి హర చతుర్థిని పురస్కరించుకొని ఆచారివీధిలోని వరసిద్ధి విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో పంచామృతాభిషేకాలను మంగళవారం నిర్వహించారు. అనంతరం స్వామివారిని పుష్పాలతో అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు శరవణ మహేష్‌శర్మ ఆధ్వర్యంలో పూజలను నిర్వహించారు.



రెండో రౌండ్‌లో రామ్‌కుమార్ జోడీ

అడిలైడ్ ఓపెన్ ఇంటర్నేషనల్–2 టెన్నిస్ టోర్నీలో రామ్‌కుమార్ రామనాథన్ (భారత్)–రేయస్ వరేలా (మెక్సికో) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రామ్–వరేలా ద్వయం 6–3, 7–6 (7/4)తో రాబిన్ హాస్–మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జోడీని ఓడించింది. 76 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్–వరేలా 14 ఏస్‌లు సంధించింది. రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీకి నేరుగా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు 'బై' లభించింది.



ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రీజ

ప్రపంచ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీటీసీ) ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. దోహాలో మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో శ్రీజ 11–2, 5–11, 2–11, 5–11, 13–11, 11–9, 11–8తో చెన్ జు యు (చైనీస్ తైపీ)పై గెలిచింది. భారత్‌కే చెందిన మనిక బత్రా 13–11, 11–9, 11–6, 11–8తో చెంగ్‌జు జు (హాంకాంగ్)పై గెలుపొందగా... దియా చిటాలె, స్వస్తిక, రీత్ టెనిసన్ ఓడిపోయారు.

గాయత్రి–ట్రెసా జాలీ జోడీ శుభారంభం



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తొలి రోజు భారత్‌కు ఆశాజనక ఫలితాలు లభించలేదు. పురుషుల సింగిల్స్ విభాగంలో కిడాంబి శ్రీకాంత్... మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్, ఆకర్షి కశ్యప్... పురుషుల డబుల్స్‌లో పంజాల విష్ణువర్ధన్ గౌడ్–గరగ కృష్ణప్రసాద్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ జోడీ శుభారంభం చేసి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. తొలి రౌండ్‌లో గాయత్రి–ట్రెసా జాలీ జోడీ 21–19, 21–14తో యంగ్ ఎన్గా టింగ్–యంగ్ పుయ్ లామ్ (హాంకాంగ్) ద్వయంపై గెలిచింది.

తొలి రౌండ్‌లోనే ఓడిన శ్రీకాంత్, సైనా

మరోవైపు ప్రపంచ మాజీ నంబర్‌వన్ సైనా నెహ్వాల్ 12–21, 21–17, 14–21తో హాన్ యుయె (చైనా) చేతిలో... ఆకర్షి కశ్యప్ 10–21, 8–21తో వెన్ చి సు (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి పాలయ్యారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో విష్ణువర్ధన్–కృష్ణప్రసాద్ ద్వయం 10–21, 18–21తో కాంగ్ మిన్ హ్యుక్–సియో సెయంగ్ జే (దక్షిణ కొరియా) జోడీ చేతిలో పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 13వ ర్యాంకర్ శ్రీకాంత్ 19–21, 14–21తో ప్రపంచ 17వ ర్యాంకర్ కెంటా నిషిమోటో (జపాన్) చేతిలో అనూహ్యంగా ఓడిపోయాడు. గతంలో నిషిమోటోపై ఐదుసార్లు నెగ్గిన శ్రీకాంత్ 2018 తర్వాత ఈ జపాన్ ప్లేయర్ చేతిలో ఓటమి పాలయ్యాడు.

నేడు జరిగే మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో కరోలినా మారిన్ (స్పెయిన్) పీవీ సింధు; ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా)తో మాళవిక... పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లక్ష్య సేన్‌తో భారత్‌కే చెందిన ప్రణయ్ తలపడతారు.

హైదరాబాద్ 79 ఆలౌట్

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ జట్టు చెత్త ప్రదర్శన కొనసాగుతోంది. మాజీ చాంపియన్ సౌరాష్ట్ర జట్టుతో మంగళవారం జింఖానా మైదానంలో మొదలైన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 30.5 ఓవర్లలో 79 పరుగులకే కుప్పకూలింది. రోహిత్ రాయుడు (23; 4 ఫోర్లు), భగత్ వర్మ (11; 2 ఫోర్లు), అనికేత్ రెడ్డి (10 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్ (3/28), ధర్మేంద్ర సింగ్ జడేజా (3/8) హైదరాబాద్ జట్టును దెబ్బ తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌరాష్ట్ర ఆట ముగిసే సమయానికి 54 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 250 పరుగులు సాధించింది. ప్రస్తుతం సౌరాష్ట్ర 171 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించింది. హైదరాబాద్ బౌలర్లలో అనికేత్ రెడ్డి (3/74), రోహిత్ రాయుడు (2/20) రాణించారు.

రాణించిన జ్ఞానేశ్వర్



న్యూఢిల్లీ: ఢిల్లీ జట్టుతో మంగళవారం మొదలైన రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 74 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 203 పరుగులు సాధించింది. ఓపెనర్ సీఆర్ జ్ఞానేశ్వర్ (81; 14 ఫోర్లు), కెప్టెన్ విహారి (76 బ్యాటింగ్; 11 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు.

తొలిసారి మహిళా అంపైర్లు...

రంజీ ట్రోఫీ మ్యాచ్‌ల్లో మంగళవారం తొలిసారి మహిళా అంపైర్లు అంపైరింగ్ బాధ్యతలు చేపట్టారు. జంషెడ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్–జార్ఖండ్ మ్యాచ్ కు గాయత్రి వేణుగోపాలన్... సూరత్‌లో రైల్వేస్–త్రిపుర మ్యాచ్‌కు జననీ నారాయణన్... పోర్వోరిమ్‌లో పాండిచ్చేరి–గోవా మ్యాచ్‌కు వృందా రాఠి అంపైర్లుగా వ్యవహరిస్తున్నారు.

'రూట్స్ కొలీజియం'తో జత కట్టిన హంపి



సాక్షి, బంజారాహిల్స్: 'రూట్స్ కొలీజియం ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్' సంస్థ తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్, 2019 ప్రపంచ ర్యాపిడ్ చెస్ విజేత కోనేరు హంపిని నియమించింది. తన కొత్త భాగస్వామ్యంపై హంపి మాట్లాడుతూ...'రూట్స్ కొలీజియంతో కలిసి పని చేయనుండటం సంతోషంగా ఉంది. నా చెస్ అనుభవాలను, ఆలోచనలను ఇక్కడి విద్యార్థులతో పంచుకుంటాను. నాకు తెలిసిన అంశాలు వారికి ఏదో రూపంలో ఉపయోగపడాలని కోరుకుంటున్నా' అని వ్యాఖ్యానించింది. ఈ కార్యక్రమంలో రూట్స్ కొలీజియం చైర్మన్ బీపీ పడాల కూడా పాల్గొన్నారు.

భారత్ 'టాప్'గేర్

- 'శత'క్కొట్టిన కోహ్లి
- రోహిత్, గిల్ దూకుడు
- తొలి వన్డేలో లంకపై 67 పరుగులతో భారత్ విజయం
- షనక సెంచరీ వృథా
- కోల్‌కతాలో రేపు రెండో వన్డే

కొత్త ఏడాదిలో ఆడిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత జట్టు దుమ్మురేపింది. సొంతగడ్డపై ఈ ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ టోర్నీకి భారీ విజయంతో సన్నాహాలు మొదలుపెట్టింది. దాదాపు నాలుగేళ్ల నిరీక్షణకు తెరదించుతూ కోహ్లి స్వదేశంలో వన్డేల్లో మళ్లీ సెంచరీ కొట్టగా... రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్ కూడా మెరిశారు. ఫలితంగా శ్రీలంకపై గెలుపుతో 'వరల్డ్‌కప్ నామ' సంవత్సరానికి టీమిండియా ఘనమైన ఆరంభాన్నిచ్చింది.



కోహ్లి సెంచరీ అభివాదం

గువహటి: 'టాప్'ఆర్డర్ బ్యాటర్ల వీరవిహారం చేయడంతో శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి వన్డేలో టీమిండియా 67 పరుగుల ఆధిక్యంతో ఘనవిజయం సాధించి సిరీస్ లో 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో వన్డే రేపు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరుగుతుంది. మొదట భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 373 పరుగుల భారీ స్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విరాట్ కోహ్లి (87 బంతుల్లో 113; 12 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో కదంతొక్కాడు. ఓపెనర్లు రోహిత్ శర్మ (67 బంతుల్లో 83; 9 ఫోర్లు, 3 సిక్సర్లు), శుబ్‌మన్ గిల్ (60 బంతుల్లో 70; 11 ఫోర్లు) చెలరేగారు. అనంతరం శ్రీలంక 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 306 పరుగులు చేసి ఓడిపోయింది. కెప్టెన్ దసున్ షనక (88 బంతుల్లో 108 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్సర్లు) అజేయ సెంచరీ సాధించాడు. నిసాంక (80 బంతుల్లో 72; 11 ఫోర్లు) రాణించాడు.

అదరగొట్టిన ఓపెనర్లు

విశ్రాంతి తర్వాత ఈ ఏడాదిని ఆరంభించిన కెప్టెన్ రోహిత్ శర్మ మునుపటి 'హిట్‌మ్యాన్'లా ఆడాడు. గిల్‌తో కలిసి ఇన్నింగ్స్‌కు శుభారంభం అందించాడు. రజిత వేసిన ఏడో ఓవర్లో రోహిత్ 2 సిక్స్‌లు, ఒక బౌండరీతో 17 పరుగులు పిండుకున్నాడు. మదుషంక ఓవర్లో 'హ్యాట్రిక్' ఫోర్లతో టచ్‌లోకి వచ్చిన గిల్ కూడా బాదడం మొదలు పెట్టడంతో లంక బౌలర్లకు కష్టాలు తప్పలేదు. దునిత్ 19వ ఓవర్లో గిల్ 4, 4, 4, 1 కొడితే ఆఖరి బంతిని రోహిత్ సిక్సర్‌గా బాదాడు. 20వ ఓవర్ వేసిన షనక... గిల్‌ను అవుట్ చేసి 143 పరుగుల భాగస్వామ్యానికి తెరదింపాడు.

కోహ్లి కమాల్...

గిల్ అవుటయ్యాక కోహ్లి రాగా... కాసేపటికే రోహిత్‌ని మదుషంక బౌల్డ్ చేశాడు. లంక హమ్మయ్య! అనుకునేలోపే మరో ధాటైన ఇన్నింగ్స్‌కు కోహ్లి శ్రీకారం చుట్టాడు. బౌండరీలతో చకచకా పరుగులు రాబట్టాడు. ఈ క్రమంలో 47 బంతుల్లో (3 ఫోర్లు, 1 సిక్స్) ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. వ్యక్తిగత స్కోరు 52, 81 పరుగుల వద్ద లైఫ్‌లు పొందిన కోహ్లి సెంచరీ దిశగా తనదైన శైలీ షాట్లతో అలరించాడు. 41వ ఓవర్లో భారత్ 300 మార్క్ చేరుకోగా, కోహ్లి 80 బంతుల్లో (10 ఫోర్లు, 1 సిక్స్) తన వన్డే కెరీర్‌లో 45వ సెంచరీ సాధించాడు. 2019 మార్చి 8న ఆస్ట్రేలియాపై రాంచీలో చివరిసారి స్వదేశంలో వన్డేల్లో కోహ్లి సెంచరీ చేశాడు. 49వ ఓవర్లో కోహ్లిని రజిత అవుట్ చేశాడు.

లంకకు పేస్ దెబ్బ

భారత సీమర్లు సిరాజ్, ఉమ్రాన్, షమీల పేస్ బౌలింగ్‌కు శ్రీలంక ఇన్నింగ్స్ ఆరంభం నుంచే కష్టాల్లో పడింది. నిసాంక బాధ్యతగా ఆడినప్పటికీ టాపార్డర్ బ్యాటర్స్ అవిష్క ఫెర్నాండో (5), కుశాల్ మెండిస్ (0)లను సిరాజ్ తన వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత కూడా వరుస విరామాల్లో మిడిలార్డర్ వికెట్లను సీమర్లు కూల్చారు. 206 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి ఓటమిని ఖాయం చేసుకున్న లంకను కెప్టెన్ షనక ఆదుకున్నాడు. షనక టెయిలెండర్ రజిత (9 నాటౌట్)తో కలిసి తొమ్మిదో వికెట్ కు 100 పరుగులు జోడించారు.



షనక

భారత్ క్రీడాస్ఫూర్తి

ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్ వేసిన షమీ... సెంచరీకి రెండే పరుగుల దూరంలో ఉన్న షనక (98 వద్ద) మన్కడింగ్ చేశాడు. నిజానికి ఇది అవుటే! కానీ కెప్టెన్ రోహిత్... షమీ దగ్గరకొచ్చి వారించాడు. వెంటనే షమీ అంపైర్‌తో అప్పీల్‌ను వెనక్కి తీసుకున్నాడు. దీంతో షనక ఐదో బంతికి ఫోర్ కొట్టి సెంచరీ సాధించగలిగాడు.

9 శ్రీలంకపై అత్యధికంగా తొమ్మిది సెంచరీలు చేసిన బ్యాటర్‌గా కోహ్లి నిలిచాడు. సచిన్ (8) పేరిట ఉన్న రికార్డును కోహ్లి సవరించాడు.

20 స్వదేశంలో అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్‌గా సచిన్ (20) పేరిట ఉన్న రికార్డును తాజా శతకంతో కోహ్లి (20 సెంచరీలు) సమం చేశాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) మదుషంక 83; గిల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షనక 70; కోహ్లి (సి) మెండిస్ (బి) రజిత 113; అయ్యర్ (సి) ఫెర్నాండో (బి) ధనంజయ 28; కేఎల్ రాహుల్ (బి) రజిత 39; పాండ్యా (సి) హసరంగ (బి) రజిత 14; అక్షర్ (సి) ఫెర్నాండో (బి) కరుణరత్నే 9; షమీ (నాటౌట్) 4; సిరాజ్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 373. వికెట్ల పతనం:** 1–143, 2–173, 3–213, 4–303, 5–330, 6–362, 7–364. **బౌలింగ్:** కసున్ రజిత 10–0–88–3, మదుషంక 6–0–43–1, హసరంగ 10–0–67–0, కరుణరత్నే 8–0–54–1, దునిత్ 8–0–65–0, షనక 3–0–22–1, ధనంజయ 5–0–33–1.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) అక్షర్ (బి) ఉమ్రాన్ 72; ఫెర్నాండో (సి) పాండ్యా (బి) సిరాజ్ 5; మెండిస్ (బి) సిరాజ్ 0; అసలంక (సి) రాహుల్ (బి) ఉమ్రాన్ 23; ధనంజయ (సి) రాహుల్ (బి) షమీ 47; షనక (నాటౌట్) 108; హసరంగ (సి) అయ్యర్ (బి) చహల్ 16; దునిత్ (సి) గిల్ (బి) ఉమ్రాన్ 0; కరుణరత్నే (సి) రోహిత్ (బి) పాండ్యా 14; రజిత (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 306. వికెట్ల పతనం:** 1–19, 2–23, 3–64, 4–136, 5–161, 6–178, 7–179, 8–206. **బౌలింగ్:** షమీ 9–0–67–1, సిరాజ్ 7–1–30–2, పాండ్యా 6–0–33–1, ఉమ్రాన్ 8–0–57–3, చహల్ 10–0–58–1, అక్షర్ 10–0–58–0.

సినిమా

మా ఇల్లే పాన్ ఇండియా



శ్రుతీహాసన్

శ్రుతీహాసన్ ఏదీ ప్లాన్ చేయరు. సినిమాలంటే ఆమెకు చాలా ఇష్టం. అయితే ఇన్నేళ్లు ఉండాలని ప్లాన్ చేయలేదు. సినిమాకి దూరం కాకూడదనుకుంటారు. అంతే.. ఇక బాబీ దర్శకత్వంలో చిరంజీవితో చేసిన 'వాల్తేరు వీరయ్య', గోపీచంద్ దర్శకత్వంలో బాలకృష్ణతో చేసిన 'వీరసింహారెడ్డి'తో ఈ సంక్రాంతికి డబుల్ ట్రీట్ ఇవ్వనున్నారామె. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన 'వీరసింహారెడ్డి' ఈ 12న, 13న 'వాల్తేరు వీరయ్య' రిలీజ్ కానున్నాయి. ఈ సందర్భంగా శ్రుతి చెప్పిన విశేషాలు..

● రెండు చిత్రాలతో మీతో మీరే పోటీ పడటం ఎలా ఉంది?

నిజానికి ఇది ఊహించలేదు. తొమ్మిదేళ్ల క్రితం నా రెండు సినిమాలు ఒకేసారి రిలీజయ్యాయి. అయితే పండగప్పుడు కాదు. ఫెస్టివల్ టైమ్‌లో రెండు పెద్ద చిత్రా లతో.. ఇద్దరు లెజెండరీ (చిరంజీవి, బాలకృష్ణ) హీరోల సినిమాలతో రావడం ఆశీర్వాదం అనుకుంటున్నా.

● రెండు సినిమాలూ హిట్టవ్వాలనే ఓ టెన్షన్ ఉంటుంది కదా...

టెన్షన్ అనేది సెట్లో పని చేస్తున్నప్పుడు మాత్రమే. ఎక్స్‌ప్రెషన్ సరిగ్గా వచ్చిందా? లేదా డైలాగ్ బాగా చెప్పానా? లేదా అనే టెన్షన్ ఉంటుంది. సెట్ నుంచి బయటికొచ్చేస్తే టెన్షన్ ఉండదు. ఎందుకంటే మిగతాదంతా ప్రేక్షకుల చేతుల్లో ఉంటుంది.

● 'వాల్తేరు..', 'వీరసింహా...'లలో ఏ సినిమాలో మీ పాత్ర బాగుంటుందనే పోలిక రావడం సహజం..

నిజమే. అయితే రెండు సినిమాల కథలు, పాత్రలు, ట్రీట్‌మెంట్ భిన్నంగా ఉంటాయి. నా పాత్రలు డిఫరెంట్‌గా, సవాల్‌గా ఉంటాయి. 'వీరసింహా..'లో నా పాత్ర కామెడీగా ఉంటుంది. కామెడీ చేయడం కష్టం. 'వాల్తేరు...'లో నా పాత్రని బాగా రాశారు.

● చిరంజీవి, బాలకృష్ణలతో డ్యాన్స్ చేయడం...

నైస్ ఎక్స్‌పీరియన్స్. 'వీరసింహారెడ్డి'లోని 'సుగుణసుందరి...' స్టెప్ బాగా రీచ్ అయ్యింది. అలాగే 'వాల్తేరు వీరయ్య'లోని 'శ్రీదేవి... చిరంజీవి' పాట కూడా అద్భుతంగా వచ్చింది.

● ఒక పాట మంచి ఎండ (సుగుణ సుందరి)లో.. మరో పాట (నువ్వు శ్రీదేవి అయితే.. నేను చిరు) విపరీతమైన చలిలో చేసిన అనుభవం గురించి?

ఇండియన్స్‌కి ఎండ సమస్య కాదు. కానీ చలి తట్టుకోవడం కష్టం. పైగా పల్చటి చీరలో మైనస్ 11 డిగ్రీల చలిలో చేయాల్సి వచ్చింది. ● ఈ విషయంలో హీరోయిన్లకే సమస్య. హీరోలు ఫుల్‌గా కవర్ చేసుకునే వీలు ఉంటుంది... యూనిట్ అంతా నాలుగైదు లేయర్ల కోట్స్ వేసుకుంటే మేం చలిలో డ్యాన్స్ చేశాం (నవ్వుతూ). సార్ (చిరంజీవి) కూడా పెద్దగా కవర్ చేసుకోలేదు. ఒక కోట్.. అంతే.

● 'వీరసింహారెడ్డి' వేడుకలో పాల్గొన్న మీరు 'వాల్తేరు వీరయ్య' వేడుకలో పాల్గొనలేదు.. కారణం?

ఆరోగ్యం బాగాలేదు. పూర్తిగా రికవర్ కాకపోవడంతో వేడుకకు వెళ్లలేకపోయా. ఐయామ్ సో సారీ.

● ఆ మధ్య మీకు తెలుగులో గ్యాప్ వచ్చింది... ఇప్పుడు ఇద్దరు సీనియర్ హీరోలతో, యంగ్ హీరో ప్రభాస్‌తో 'సలార్'.. వరుసగా సినిమాలు చేయడం ఎలా ఉంది?

మా ఇంట్లో మా అమ్మానాన్నని చూసి సినిమా అనేది ఫ్యామిలీ అనిపించింది. ఇక ఇండస్ట్రీ, ఆడియన్స్ పరంగా తెలుగు నాకు రియల్ ఫ్యామిలీ అంటాను. ఎందుకంటే సౌత్‌లో నేను పరిచయం అయింది తెలుగు సినిమాల ద్వారానే. ఒక కొత్త ప్రాంతంలో నాకు మంచి ఆహ్వానం దక్కింది. ప్రేక్షకులు నన్ను అంగీకరించారు. హిట్ ఇచ్చారు. 'క్రాక్' తర్వాత మళ్లీ తెలుగులో వరుసగా సినిమాలు చేయడం ఆనందంగా ఉంది.

'పాన్ ఇండియా' ట్రెండ్ గురించి మీ అభిప్రాయం?

నిజానికి నా లైఫ్ చూస్తే.. నేను పాన్ ఇండియన్‌ని (నవ్వుతూ). మా అమ్మ ముంబై (సారిక).. నాన్న (కమల్‌హాసన్) తమిళనాడు. మా డైనింగ్ టేబుల్ మీద మహారాష్ట్రియన్ ఫిష్ కర్రీ చపాతి, సాంబార్, రైస్ అన్నీ ఉంటాయి. మాది ప్రాపర్ ఇండియన్ హోమ్. అమ్మ ముంబై నుంచి చెన్నై వెళ్లి తమిళ్ నేర్చుకున్నారు. మాట్లాడటం మాత్రమే కాదు.. రాయడం కూడా నేర్చుకున్నారు. నాన్న తమిళ్, తెలుగు, మలయాళం, హిందీ, బెంగాలీ.. ఇలా చాలా భాషలు మాట్లాడతారు. ఇంట్లో హిందీ, తమిళ్, ఇంగ్లిష్ మాట్లాడతాం. నా చిన్నప్పుడు ఒక సినిమా రిలీజ్ అంటే ముంబై, అట్నుంచి ఫ్లైట్‌లో హైదరాబాద్, లేకపోతే చెన్నై.. ఇలా వెళ్లేవాళ్లం. పాన్ ఇండియా కాన్సెప్ట్ అనేది నా మైండ్‌లో చిన్నప్పుడే ఉంది. అయితే బాలీవుడ్, టాలీవుడ్ అని పేరు వచ్చినప్పుడు మా నాన్న 'ఇండియన్ సినిమా అందాం. ఆ తర్వాత భాష గురించి మాట్లాడదాం' అనేవారు. నేను పుట్టి, పెరిగింది చెన్నైలోనే. కానీ హిందీ సినిమా ద్వారా హీరోయిన్‌గా పరిచయమయ్యాను. అట్నుంచి తెలుగుకి వచ్చాను. ఆ తర్వాతే తమిళ్‌కి పరిచయం అయ్యాను. చెప్పాలంటే 'మా ఇల్లే పాన్ ఇండియా'. ఇప్పుడు పాన్ ఇండియా అంటూ అందరూ అన్ని సినిమాలూ చూడటం పాజిటివ్ విషయం.

సంక్రాంతి ఎలా జరుపుకుంటారు?

'సంక్రాంతి' అనే పదం నేను తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన తర్వాతే నా లైఫ్‌లోకి వచ్చింది. మాకు తమిళ్‌లో 'పొంగల్' అంటాం. పండగ రోజు పొంగలి వండుతాను. పూజ చేస్తాను. ఫ్యామిలీతో గడుపుతాను.

గోపీచంద్ మలినేని మిమ్మల్ని లక్కీ హీరోయిన్ అంటారు. లక్‌ని మీరు నమ్ముతారా?

లేదు.. హార్డ్ వర్క్‌ని, దేవుడిని నమ్ముతాను. ఒకవేళ ఎవరైనా నన్ను లక్కీ అంటే వాళ్లకు థ్యాంక్స్ చెబుతాను. అయితే నేను లక్, అన్‌లక్‌ని నమ్మను. ఎందుకంటే ఒకప్పుడు నన్ను 'అన్‌లక్కీ' అన్నారు. ఆ తర్వాత 'లక్కీ' అన్నారు. వేరేవాళ్లు నన్ను అలా అనడం ఆశీర్వాదంలా భావిస్తున్నాను.

సీనియర్ హీరోల సరసన సినిమా చేస్తే ఇక ఆ హీరోయిన్ సీనియర్ హీరోల సినిమాలకే అని ఫిక్స్ అవుతుంటారు. ఇలాంటి టైమ్‌లో ప్రభాస్‌లాంటి యంగ్ హీరోతో 'సలార్' చాన్స్ రావడం అడ్వాంటేజ్ అనుకుంటున్నారా?

కథ, నా క్యారెక్టర్ మాత్రమే చూస్తాను. 'వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య' కథలు, నా పాత్రలు నచ్చాయి. ఫస్ట్ నుంచీ సినిమాని సినిమాగా చూసి, ఒప్పుకోవడం నాకు అలవాటు. అంతే కానీ వేరేవాళ్లు ఏమనుకుంటారో అని ఆలోచించి ఒప్పుకోను. నాకు ఏది కరెక్ట్ అనిపిస్తే అది చేస్తాను. 'సలార్' విషయానికి వస్తే.. నటుడిగా ప్రభాస్ అంటే ఇష్టం. ప్రశాంత్ సార్ సినిమాలంటే ఇష్టం. ఆ పరంగా నేను హ్యాపీ. అది నాకు అడ్వాంటేజ్ అనుకుంటున్నాను.

ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో... పది భారతీయ చిత్రాలు





ప్రతిష్ఠాత్మక 95వ ఆస్కార్ అవార్డ్స్ వేడుక ఈ ఏడాది మార్చి 12న జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా 301 చిత్రాలు ఈ ఏడాది ఆస్కార్ పురస్కారాల కోసం పోటీ పడుతున్నాయి. వాటిలో ఇండియా నుంచి 10 సినిమాలు ఆస్కార్ అవార్డుల నామినేషన్ బరిలో ఉన్నాయి. తొలి జాబితాలో 'ఆర్ఆర్ఆర్ (తెలుగు), ఛెల్లో షో (గుజరాతీ), మీ వసంతరావ్ (మరాఠీ), తుఝ్యా సాఠీ కహీ హై (మరాఠీ), ఇరవిన్ నిళల్ (తమిళ్)' వంటి చిత్రాలు ఇప్పటికే ఆస్కార్ నామినేషన్స్ షార్ట్ లిస్ట్‌లో ఉన్నాయి. కాగా ఆస్కార్ అవార్డులకు పోటీపడేందుకు అవకాశం ఉన్న 301 చిత్రాల్లోని మిగతా జాబితాను అవార్డ్స్ కమిటీ మంగళవారం వెల్లడించింది. అందులో 'ది కశ్మీరీ ఫైల్స్' (హిందీ), 'గంగూబాయి కతియావాడి' (హిందీ), 'కాంతార' (కన్నడ), 'విక్రాంత్ రోణ' (కన్నడ), 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్ (తమిళ్)' చిత్రాలు ఉన్నాయి. కాగా ఇండియా తరఫున గుజరాతీ సినిమా 'ఛెల్లో షో' ఆస్కార్ బరిలో నిలుస్తున్నట్లు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా 'ఆర్ఆర్ఆర్' సినిమాతో పాటు మరికొన్ని చిత్రాలు ఓపెన్ కేటగిరీలో నిలిచాయి.

ఇక ఏయే సినిమా ఏయే విభాగంలో పోటీ పడుతుందనే విషయానికి వస్తే.. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్ఆర్ఆర్' బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగం (నాటు నాటు.. పాట)లో షార్ట్ లిస్ట్‌లో నిలిచింది. ఈ చిత్రానికి కీరవాణి సంగీత దర్శకుడు. అలాగే ఉత్తమ విదేశీ చిత్రం కేటగిరీలోనూ 'ఆర్ఆర్ఆర్' షార్ట్‌లిస్ట్ అయిన సంగతి తెలిసిందే.

కాగా ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు విభాగాల్లో 'కాంతారా' ఎంపికైంది. రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ఇది.

అదే విధంగా సుదీప్ హీరోగా అనూప్ బండారి దర్శకత్వం వహించిన కన్నడ చిత్రం 'విక్రాంత్ రోణ', సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో ఆలియా భట్ టైటిల్ రోల్‌లో నటించిన బాలీవుడ్ చిత్రం 'గంగుబాయి కతియావాడి', వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వంలో రూపొందిన 'ది కశ్మీరీ ఫైల్స్' వంటివి ఉత్తమ చిత్రం కేటగిరీలో షార్ట్ లిస్టులో చోటు సంపాదించుకున్నాయి.

నేటి నుంచి ఓటింగ్ ప్రారంభం కానుంది. ఈ నెల 17 వరకు ఓటింగ్‌కు అవకాశం ఉంటుంది. షార్ట్ లిస్ట్‌లోని తుది నామినేషన్లను ఈ నెల 24న ప్రకటిస్తారు.

పోటీ ఉన్నప్పుడే మంచి కంటెంట్ వస్తుంది



\- ఎస్ఎస్ తమన్

"పోటీ అనేది సినిమాల్లోనే కాదు.. ప్రతి చోటా ఉంటుంది. పోటీ ఉన్నప్పుడే మంచి కంటెంట్ వస్తుంది. ఆరోగ్యకరమైన పోటీ మంచిదే. అన్ని సినిమాలూ గొప్పగా ఆడాలి.. అందరూ బాగుండాలి" అని సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ అన్నారు. బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా రేపు (గురువారం) రిలీజవుతోంది. ఈ చిత్రానికి సంగీతం అందించిన తమన్ చెప్పిన విశేషాలు. ● బాలకృష్ణగారితో నేను చేసిన 'అఖండ' సినిమాతో 'వీరసింహారెడ్డి'కి పోలికే లేదు. ఇది కల్ట్ మూవీ. ఎమోషనల్, సిస్టర్ సెంటిమెంట్, బాలకృష్ణగారి మాస్.. ఇలా అన్ని అంశాలతో అదిరిపోతుంది. ● దర్శకుడు మంచి సినిమా తీస్తేనే నేను మంచి మ్యూజిక్ ఇవ్వగలను. ఒక సినిమాకి పునాది దర్శకుడే. బాలకృష్ణగారి అభిమానిగా గోపీచంద్ చాలా గొప్పగా తీశారు.. దాని వల్లే నాకూ మంచి మ్యూజిక్, నేపథ్య సంగీతం ఇచ్చే అవకాశం వచ్చింది. సినిమా ఏం కోరుకుంటుందో అది ఇవ్వడమే మన పని. ఇందులో 'జై బాలయ్య, సుగుణ సుందరి, మాస్ మొగుడు..' వంటి పాటలన్నీ చక్కగా కుదిరాయి. మాస్ సినిమాలో కూడా కథ నుండే ట్యూన్ పుడుతుంది. ● 'అఖండ'లో మ్యూజిక్‌కి స్పీకర్లు పగిలిపోయాయి. 'వీరసింహారెడ్డి'లోనూ స్పీకర్లు పగులుతాయి జాగ్రత్త అని ముందే చెప్పాను. బాలకృష్ణగారిని చూస్తేనే ఎక్కువ వాయించేయాలనిపిస్తుంది (నవ్వుతూ). చాలా రోజుల తర్వాత సెకండ్ హాఫ్‌లో నాలుగు పాటలు, నాలుగు ఫైట్లతో అదరగొట్టే సినిమా ఇది. పాప్ కార్న్ తినే టైమ్ కూడా ఉండదు.. సినిమాని చూస్తూనే ఉంటారు. ● ఈ సంక్రాంతికి విడుదలవుతున్న చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' రెండూ గొప్పగా ఆడాలని కోరుకుంటున్నాను.

వినరో... విష్ణు తత్త్వం

కిరణ్ అబ్బవరం, కశ్మీరా పర్దేశీ జంటగా మురళీ కిశోర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్‌పై బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 17న రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్‌ని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా 'బన్నీ' వాసు మాట్లాడుతూ– "ఈ సినిమా కథ చెప్పినప్పుడే టైటిల్ చెప్పాడు మురళీ కిశోర్. నేను కథ మొత్తం విన్నాక 'ఇందులో ఏమైనా దేవుడి ఎలిమెంట్ ఉందనుకుంటున్నారా?' అని అడిగాడు. విష్ణు తత్త్వం ఇంత క్లారిటీగా కనిపిస్తోంది కదా! అన్నాను. ఒక మనిషి చిరునవ్వుని, అవతలవాడికి సాయపడే విధానాన్ని చాలా కమర్షియల్‌గా చెప్పినందుకు మురళికి థ్యాంక్స్" అన్నారు. "ఈ సినిమా మాది అనుకుని పని చేసిన టీమ్‌కి థ్యాంక్స్" అన్నారు మురళీ కిశోర్. "గీతా ఆర్ట్స్‌లో సినిమా చేసే అవకాశం ఇచ్చిన బన్నీ వాసూగారికి థ్యాంక్స్" అన్నారు కిరణ్ అబ్బవరం.



● కశ్మీరా, కిరణ్ అబ్బవరం

నా కల తీరుతోంది



\- సంతోష్ శోభన్

"నాన్న (శోభన్) దర్శకత్వంలో ప్రభాస్ అన్న నటించిన 'వర్షం' సినిమా 2004లో సంక్రాంతికి విడుదలై హిట్ అయింది. నా సినిమాని కూడా సంక్రాంతికి రిలీజ్ చేసుకోవాలనేది నా కల.. 'కల్యాణం కమనీయం' చిత్రంతో అది తీరుతోంది" అని హీరో సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియ భవానీ శంకర్ జంటగా నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ– "ఈ సంక్రాంతికి బిగ్ స్టార్స్ సినిమాలు కూడా విడుదలవుతున్నాయి. నేను కూడా 'వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, వారసుడు' చిత్రాలు చూస్తాను. నా సినిమా కాబట్టి 'కళ్యాణం కమనీయం' నాకు మరింత స్పెషల్. పెళ్లైన ఓ కొత్త జంట తమ వైవాహిక జీవితంలో ఎదురైన పరిస్థితులను తట్టుకుని ఎలా ముందుకు సాగింది? అనేది 'కల్యాణం కమనీయం' కథ. యూవీ క్రియేషన్స్‌లో మూడు చిత్రాలు చేశాను.. మరో ముప్పై చేసేందుకైనా సిద్ధం. నా లైఫ్‌లో పేరున్న దర్శకులు మారుతి, మేర్లపాక గాంధీలాంటి వారితో సినిమాలు చేయడం అదృష్టంగా భావిస్తున్నాను" అన్నారు.